# కసాపురం.. అభివృద్ధి పథం

- నెట్టికంటి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం
- ఎస్సీకాలనీకి శ్మశాన వాటిక ఏర్పాటు
- రూ.5 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే వైవీఆర్ చొరవపై గ్రామస్తుల హర్షం


కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం


కసాపురం దేవస్థానం నుంచి గుంతకల్లు-గుత్తి జాతీయ రహదారి వరకూ బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్ (ఫైల్)

**గుంతకల్లు రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులు, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో మండలంలోని కసాపురం గ్రామంతోపాటు నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాముఖ్యత అందరికీ తెలిసిందే. స్వామి దర్శనానికి నిత్యం వేలాది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి నిత్యం వస్తుంటారు. భక్తులకు ఆలయంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. భక్తులకు వసతితోపాటు, ఆలయాన్ని అధునాతన సౌకర్యాలతో తీర్చిదిద్దేలా పాతికేళ్ల క్రితం ఆలయ అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించి అనుమతి కోసం దేవదాయ శాఖకు పంపారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా మాస్టర్‌ప్లాన్‌కు మోక్షం కలగలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మాస్టర్ ప్లాన్ అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి దేవదాయ శాఖ కమిషనర్ మొదలుకొని, దేవదాయ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని పలుమార్లు కలిసి సమస్యను విన్నవించి ప్రభుత్వ అనుమతి పొందడంలో సఫలీకృతుడయ్యాడు. దీంతో 8 నెలల క్రితం ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ అమలుకు అనుమతి నిస్తూ ఆ పనులను ద్రోణ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కసాపురంలో పర్యటించిన ఇంజనీరింగ్ కల్సల్టెన్సీ బృందం ఆలయ పరిసరాలను పరిశీలించి త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపింది.

**కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత ..**

నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో 2011లో పవన్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా 42 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. ఆలయ నిర్వహణలో భాగంగా అవసరమైన ప్రతిసారీ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పెంచుతూ రావడంతోసిబ్బంది సంఖ్య క్రమంగా 64 మందికి చేరుకుంది. కానీ పెరిగిన 22 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కమిషనర్ ఆర్డర్ లేకపోవడం, పలుమార్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో పెరిగిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వైవీఆర్ కృషి ఫలితంగా ఎట్టకేలకు 64 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

**రూ.4 కోట్లతో బీటీ రోడ్డు..**

నిత్యం స్వామివారి దర్శనార్థం వచ్చే ప్రజలు గుంతకల్లు ద్వారా కసాపురం చేరుకోవాలి. నిత్యం జనంతో కిక్కిరిసిన గుంతకల్లు పురవీధులను దాటుకొని ఆలయానికి చేరుకోవడానికి భక్తులు అవస్థలు పడాల్సి వచ్చేది. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి చెన్నప్ప కొట్టాల మీదుగా గుంతకల్లు-గుత్తి జాతీయ రహదారి వరకూ రూ.4 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం చేయించారు. దీంతో అనంతపురం, కర్నూలు, కడప తదితర జిల్లాల నుంచి వచ్చే భక్తులు గుంతకల్లు పట్టణంలోపలికి రాకుండా పట్టణ శివారు ప్రాంతం నుంచినేరుగా ఆలయానికి చేరుకునే విధంగా ఏర్పాటు చేశారు.

**30 ఏళ్ల సమస్య పరిష్కారం..**

కసాపురం ఎస్సీ కాలనీ వాసులకు 30 ఏళ్లుగా శ్మశాన వాటిక లేక వారు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో ఆలయ పరిసరాల్లోనే మృతదేహాలను ఖననం చేస్తున్న తరుణంలో ఆలయ అధికారులు అడ్డుచెప్పడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అధికారులు, పాలకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌ను పలుమార్లు కలిసి సమస్యను వివరించారు. దీంతో కలెక్టర్ ఎస్సీ కాలనీవాసులకు శ్మశాన వాటిక కోసం 4.5 ఎకరాలను కేటాయించారు. ఎమ్మెల్యే సొంత డబ్బు వెచ్చించి ఆ భూమిలో బోరు వేయించారు. అలాగే పదేళ్ల క్రితం ప్రభుత్వం 25 మంది గ్రామస్తులకు ఇంటి పట్టాలను ఇచ్చిన స్థలం చూపలేదు. ఎమ్మెల్యే చొరవతో వారికి స్థలం చూపడంతోపాటు ఇంటి పట్టాలు ఇప్పించారు.

**గ్రామంలో అభివృద్ధి పనులు..**

ఎమ్మెల్యే వైవీఆర్ గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. రూ.14 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటు, రూ.12 లక్షలతో ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. రూ.12 లక్షలతో గ్రామ శివారులోని తిక్కస్వామి దర్గాకు సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో గ్రామంలో అక్కడక్కడ కల్వర్టులు, డ్రైనేజీలు, పైప్‌లైన్ మరమ్మతు చేపట్టారు.

### ఎమ్మెల్యే మేలు మరువలేం



ఆలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ భార్యా పిల్లలను పోషించుకుంటున్నా. మొత్తం 64 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందికి గానూ 22 మందికి కమిషనర్ ఆర్డర్స్ లేకపోవడంతో ఉద్యోగాలు పోయే పరిస్థితి. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని కలిసి సమస్యను వివరించాం. మాకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని భరోసా ఇచ్చిన ఆయన అన్నట్టుగానే 6 నెలలు తిరిగేలోపు కమిషనర్ నుంచి ఆర్డర్ తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మేలును ఎన్నటికీ మరువం.

– రాము, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

### శ్మశాన వాటిక లేక ఇబ్బందులు



గతంలో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం పడమర భాగాన ఉన్న ఖాళీ స్థలంలో మృతదేహాలను ఖననం చేసేవాళ్లం. ఆలయ అధికారులు అడ్డుకోవడంతో ఎక్కడ పడితే అక్కడ మృతదేహాలను ఖననం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సమస్యను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవ చూపి శ్మశాన వాటిక స్థలం ఇప్పించడంతోపాటు బోరు కూడా వేయించారు.

–నెట్టికంటమ్మ , కసాపురం

## క్లుప్తంగా

### థ్యాంక్యూ సీఎం సార్


ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**గుంతకల్లుటౌన్:** బీసీలకు వెన్నుదన్నుగా నిలిచిన సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి బీసీలందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ల పదవీకాలాన్ని పొడిగించిన విషయం విదితమే. ఆదివారం గుంతకల్లుకు చెందిన లింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, తొగటవీర, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుండా జ్యోతి, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ పి.హొన్నూర్‌వలి ఎమ్మెల్యేను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సీఎం వైఎస్.జగన్, ఎమ్మెల్యే వైవీఆర్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత రాఘవేంద్ర ఉన్నారు.

### నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని 16వ వార్డులో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

### నేటి నుంచి ప్రతిష్టాపనోత్సవాలు

**యాడికి:** రాయలచెరువు గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణ నేపథ్యంలో సోమవారం నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచు తలారి అరుణ, వైస్ ఎంపీపీ హసీనాబేగం తెలిపారు. తొలిరోజు గణపతి పూజ, గంగపూజ, గోపూజ, 24న జపాలు, చండీ హోమం, దీక్షా హోమం, సాయంత్రం గ్రామోత్సవం, 25న ఉదయం 4 గంటల నుంచి యంత్ర, బింబ, ప్రాణ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

**పామిడి:** పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం సీఎస్ఐ గుత్తి డివిజనల్ చైర్మన్, పాస్టర్ జీ డేవిడ్‌నాయక్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఎలక్ట్రికల్ భాస్కర్ కుటుంబం సౌజన్యంతో ముద్రించిన క్యాలెండర్లను చర్చి కార్యదర్శి పరదేశి విజయశేఖర్‌రాజు సమక్షంలో ప్రార్థన అనంతరం విడుదల చేశారు. చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, రత్నరాజు, కిష్టఫర్ బాబు, బుజ్జిబాబు, కరుణాకర్, అనిల్‌కుమార్‌రాజా, బాలరాజు, ప్రసాద్, రజని, చంద్రకళ, సుశీలమ్మ, ప్రశాంతి, ప్రిస్కిల్లా, ఎస్తేరు పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

**బుక్కరాయసముద్రం:** మండలంలోని రోటరీపురంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మేకల నాగరాజు(35) వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతుండేవాడు. తనకున్న రెండెరాల భూమిలో వేరుశనగ పంట సాగు చేసేవాడు. ఇతనికి భార్య సరస్వతి ఉంది. కుటుంబ పోషణతోపాటు పంట సాగు కోసం అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మథనపడుతుండేవాడు. ఈక్రమంలో తీవ్రమనస్థాపానికి గురై శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### నేటి నుంచి పెద్దమ్మ ఆలయంలో పూజలు

**యల్లనూరు:** కొడవండ్లపల్లిలో వెలసిన పెద్దమ్మ అమ్మవారి సన్నిధిలో మాఘమాసం మొదటివారం సందర్భంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు తెలిపారు. మంగళవారం చండీయాగం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### కంటి వైద్యశిబిరం

**యాడికి:** వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు సౌజన్యంతో యాడికి మండల కేంద్రం పంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నంద్యా జిల్లాకు చెందిన ప్రైవేటు ఆస్పత్రి వారు సుమారు 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 50 మందిని శస్త్రచికిత్స కోసం నంద్యాలకు తరలించారు. ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, వార్డు మెంబర్ తిరుపతి, డీలరు రాము, నాయకులు చౌదరి, శ్రీరాములు, వైద్యులు పాల్గొన్నారు.

### కేంద్రం హామీలు అమలు చేయాలి

**గుత్తి రూరల్:** కౌలు రైతులకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య డిమాండ్‌చేశారు. ఆదివారం పెద్దొడ్డిలో ఈ నెల 26న జరిగే కౌలు రైతుల ట్రాక్టర్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు నిర్మల, గురునాగరాజు, నారాయణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

### వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

**గుంతకల్లు:** వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ రాజాబాబు సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నక్కనదొడ్డి సమీపంలోని ఐఓసీలో ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర డీజిల్, పెట్రోల్ వంటి రవాణా చేసే ట్యాంకర్ల డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలన్నారు. వాహనాలు ప్రమాదానికి గురైతే పరిమాణాలు తీవ్రంగా ఉంటాయని తెలియజేశారు. డ్రైవర్లు తమ ప్రాణాలతో పాటు కుటుంబసభ్యులు తమపై ఆధారపడి ఉన్నారనే విషయం మర్చిపోరాదన్నారు. ముఖ్యంగా రహదారుల్లో ప్రమాదం జరిగితే తమ ఎందుకులే అనే భావించకుండా సకాలంలో క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలిస్తే వారిని కాపాడవచ్చన్నారు. ఇలాంటి వారికి సర్టిఫికెట్లు, రూ.5 వేలు నగదు అందిస్తారన్నారు. అనంతరం భద్రతపై ముద్రించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఐఓసీ అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ట్యాంకర్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వేమన పద్యాలపై అవగాహన

**గార్లదిన్నె:** ఎగువపల్లిలో ఆదివారం వేమన జయంతిని పురస్కరించుకుని వేమన పద్యాల నిగూఢ తత్వార్థ బోధిని, త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవుడిని పూజించడమే కాకుండా దేవుడు అందించిన గీతజ్ఞానం ద్వారా కర్మ విధానం తెలుసుకోని మోక్షం పొందాలన్నారు. త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలు చదివి ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందూ జ్ఞాన వేదిక,ప్రబోధ సేవా సమితి గుత్తి కమిటీ అధ్యక్షుడు రవికుమార్, బ్రహ్మయ్య, నాగరాజు, చంద్రశేఖర్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, నందకుమార్ పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య చిత్రంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, సమావేశానికి హాజరైన రైతులు, నాయకులు

**ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే వైవీఆర్**

**గుత్తి రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తూ రైతు పక్షపాతిగా నిలిచారని అనంతపురం ఎంపీ తలారీ రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. గుత్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొజ్జేపల్లికి చెందిన చెవుల సునీల యాదవ్, వైస్ చైర్మన్‌గా పామిడికి చెందిన రెక్కల నాగిరెడ్డితో మార్కెట్ యార్డు కార్యదర్శి బాలాజీ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ కార్పొరేషన్లతో పాటు స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. ముఖ్యంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేశారని గుర్తు చేశారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించి గ్రామాల్లోనే రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మట్టి పరీక్షల ఫలితాలు, పంటకోత ప్రయోగాలను చేయించి రైతులకు అండగా నిలిచారన్నారు. అదే విధంగా రైతులు పండించిన ఉత్పత్తులు గ్రామాల్లోనే ప్రభుత్వం కొనుగోలు చేస్తూ రైతుకు అన్ని విధాలుగా తోడ్పాటునిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా మంచి చేస్తున్న జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ప్రజలు చిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో కలుపుతారన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా సీఎం జగన్‌కు రాష్ట్ర ప్రజలు అండగా ఉన్నారన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. 2024లో 175 స్థానాలకు 175 స్థానాలు సాధిస్తామని చెప్పే దమ్ము ధైర్యం ఉన్న నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని వారు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూరుబీ, ఎంపీపీలు విశాలాక్షి, మురళీమోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు అప్పావెంకటేష్, చిదంబరి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్యయాదవ్, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, కౌన్సిలర్లు ఫరూక్, వరద, రూపవతి, శివరాం, సుబ్బయ్య, రమణ, నాయకులు రాజ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, రాముయాదవ్, బేడల వెంకట్రాముడు, రాముయాదవ్, పుల్లారెడ్డి, లాలునాయక్, కాంతారెడ్డి, హరినాథ్‌రెడ్డి, సూర్యప్రకాష్, ప్రవీణ్‌కుమార్ యాదవ్, ఎంసీ.నాగరాజు, వీరా, డైరెక్టర్లు గోవిందుగౌడ్, రవూఫ్, మెహతాజ్, పద్మావతి, ఆదిలక్ష్మి, నాగరాజు, అమర్‌నాథ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేత మృతి



వెంకటరామిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డి

**యల్లనూరు:** గడ్డంవారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెంకటరామిరెడ్డి అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. కొంతకాలంగా చెక్కర వ్యాధితో పాటు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని మధ్యాహ్నానికి స్వగ్రామానికి తీసుకొచ్చారు. ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, యువ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు వెంకటరామిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంకటరామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. మృతునికి ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నేత ఈశ్వరరెడ్డితో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## పేదల మేలు కోసం మళ్లీ జగనన్నే రావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

**గుంతకల్లుటౌన్:** రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి జరగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో జనరంజకమైన పాలన సాగుతోందన్నారు. ప్రజల్లో సీఎం జగనన్నపై ఉన్న ఆదరాభిమానాలు, సానుకూల ధోరణిని ఓట్ల రూపంలో మలుచుకోవాలని చెప్పారు. పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు గృహసారథులతో కలిసికట్టుగా పనిచేస్తే 175 సీట్లు గెలవడం సులభమన్నారు. గడిచిన మూడున్నరేళ్లల్లో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు, ఆయా వార్డులు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలందరికీ వివరించాలన్నారు. టీడీపీ, జనసేన, ఇతర పార్టీలతో పాటు ఎల్లోమీడియా చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.రామలింగప్ప, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్.మోహన్, సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మోహన్, పట్టణ సచివాలయ కన్వీనర్లు జింకల రామాంజనేయులు, ఎండీ.ఖలీల్, మండల కన్వీనర్ గోవింద్‌నాయక్, చింబిలి భాస్కర్, కౌన్సిలర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష


గుత్తి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

**గుత్తి రూరల్:** పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. గుత్తి పట్టణంలో మొత్తం ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏడు కేంద్రాలలో 2, 260 మందికిగాను 2,145 మంది పరీక్షలు రాశారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద ముగ్గురు డీఎస్పీలు, ఐదుగురు సీఐ, తొమ్మిది మంది ఎస్ఐలు, 60 మంది విధులు నిర్వర్తించారు. అభ్యర్థులు వాచ్, సెల్, హెడ్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకొని పోకుండా పటిష్టంగా తనిఖీలు చేపట్టారు. పరీక్ష అనంతరం ఏడు కేంద్రాల నుంచి ప్రశ్నపత్రాలను పటిష్ట బందోబస్తు నడుమ గుత్తి పోలీసుస్టేషన్‌కు తరలించారు. డీఎస్పీలు నర్సింగప్ప, చైతన్య, గంగయ్య, సీఐలు వెంకటరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, గణేష్ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

**పామిడి:** పట్టణంలోని మోడల్‌స్కూల్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో ఆదివారం పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నాలుగు కేంద్రాలకు సంబంధించి 1,100 మంది అభ్యర్థులకు గాను 1,041 మంది పరీక్షకు హాజరయ్యారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్ చాంద్‌బాషా, పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద గట్టిబందోబస్తు చేపట్టారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఎస్పీ నర్సింగప్ప పర్యవేక్షించారు.

## గుజిరీ దుకాణంలో మంటలు


మంటలు అదుపు చేస్తున్న దృశ్యం

**పామిడి:** పట్టణ 44వ నెంబర్ జాతీయ రహదారిపై గుజిరీ దుకాణంలో మంటలు చెలరేగి వస్తువులు దగ్ధమయ్యాయి. బాధితుడి వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన అలీసాబ్ గుజిరీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం కావడంతో దుకాణాన్ని మూసివేశాడు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా దుకాణంలో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అనంతపురం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే దుకాణంలోని గుజిరీ సామాగ్రి దగ్ధమైంది. ఏఎస్ఐ మహమ్మద్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హైవేపై గతంలోనూ గంగాభవానీ సూపర్‌మార్కెట్, చాంద్ గ్యారేజ్ అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. వరుసగా షాపుల్లో మంటలు చెలరేగుతుండడంపై షాపుల నిర్వాహకులు, స్థానికులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు.

## వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం

**గుంతకల్లు రూరల్:** వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కసాపురం గ్రామానికి చెందిన చిట్టిబాబు కసాపురం దేవస్థానంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ భార్య పిల్లలను పోషించుకుంటున్నాడు. ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతున్న తన భార్య అనితకు ఆపరేషన్ చేయించాడు. వైద్య ఖర్చులకు డబ్బులేక ఇబ్బంది పడుతున్నారు. సమస్యను వైఎస్సార్‌సీపీ నాయకుడు బెస్త మనోహర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వారికి రూ.10 నగదు అందజేశారు.

## అనాథ పిల్లలకు చేయూత


అనాథ పిల్లల అవ్వకు బాండు అందిస్తున్న దృశ్యం

**తాడిపత్రి టౌన్:** స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన అనాథ పిల్లలకు ఆదివారం మిషన్ ఎడ్యుకేషన్ సంస్థ సభ్యులు తమ వంతు చేయూత అందించారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఉమాదేవి, శ్రీరంగ దంపతులు నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి హరిత, నాగవేణి ఉన్నారు. ప్రస్తుతం వీరు వారి అవ్వ వద్ద ఆశ్రయం పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మిషన్ ఎడ్యుకేషన్ సంస్థ ఇద్దరు పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఒక్కొక్కరి పేరున రూ.25 వేల చొప్పున రూ.50 వేలు బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన బాండ్లను ఆదివారం మిషన్ ఎడ్యుకేషన్ సంస్థ అధ్యక్షుడు బాల నరసింహులు, సెక్రటరీ గంగరాజు సభ్యులు అనాథ పిల్లల అవ్వకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రంగయ్య, బాల ఓబులేసు, సుబ్బరాయుడు, ఆనంద్, రాము, బాలరాజు, ఉద్యోగ,ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీహరి, సభ్యులు పాల్గొన్నారు.